సాక్షి
మెదక్
మంగళవారం । 24 । జనవరి । 2023



డిజిటల్ సేవలకు సై.. 8లో
నగదు రహిత లావాదేవీలకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. గతంలో జిల్లా, మండల కేంద్రాలకే పరిమితమైన ఆన్‌లైన్ లావాదేవీలు ప్రస్తుతం గ్రామస్థాయికి చేరాయి.



కూడవెల్లికి పోటెత్తిన భక్తులు
దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కూడవెల్లి రామలింగేశ్వర జాతరకు మూడోరోజు భక్తులు పోటెత్తారు. ఒక్కరోజే సుమారుగా 2 లక్షల కుపైగా దర్శించుకున్నారు. 8లో



ప్రతీ ఒక్కరికి వైద్యం చేయించాలి
కంటి వెలుగులో ప్రతీ ఒక్కరికి వైద్యం చేయించాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కూకుట్లపల్లిలో కార్యక్రమం ప్రారంభించారు. 9లో

వరిపై రెక్కల పురుగు

తెగుళ్ల దాడితో సతమతమవుతున్న రైతులు

- డిసెంబర్ నాట్లకు మరింత అధికం
- చలి తీవ్రత వల్లే అంటున్న అధికారులు
- రెండు, మూడుసార్లు మందుల పిచికారీ



చందాపూర్‌లో రోగం సోకిన పంట

మెదక్‌జోన్ : ఈ రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంటపై మూకుమ్మడిగా తెగుళ్ల దాడి జరుగుతుంది. రెక్కల పురుగు, మొగిపురుగు, లద్దెపురుగు తెగుళ్లతో పంటలు ధ్వంసం అవుతున్నాయి. వాటి నివారణ కోసం ఒక్కో రైతు రెండు, మూడుసార్లు మందులను పిచికారీ చేస్తున్న ఫలితం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

- జిల్లాలో ఈఏడాది సాధారణ సాగు 2.10 లక్షల ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1.32 లక్షల ఎకరాల్లో సాగైనట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఇంకా 78 వేల ఎకరాల్లో వరిసాగు కావాల్సి ఉంది.
- ఈయేడు డిసెంబర్ మొదటి వారం నుంచే జిల్లాలో వరి సాగు ప్రారంభించారు.
- పంటకు రెక్కల పురుగు, లద్దె పురుగు, మొగిపురుగు తెగుళ్లతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.
- ముఖ్యంగా డిసెంబర్ మాసంలో సాగు చేసిన పంటలపై ఈ తెగుళ్ల ప్రభావం మరింత ఎక్కువగా ఉంది.
- ఇప్పటికే ఒక్కో రైతు రెండు నుంచి మూడుసార్లు పలు రకాల మందుల పిచికారీ చేయడంతోపాటు గుళికలు సైతం చల్లారు.
- అయిన్నటికీ వాటి తెగుళ్ల ఉధృతి ఏమాత్రం తగ్గడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.
- ముఖ్యంగా చలితీవ్రత అధికంగా ఉండటంతో తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంటుందని, మందుల పిచికారీకి ఏమాత్రం తగ్గడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు.
- ముందుగా వరి నారుమడి (తూకం)పై రెక్కల పురుగులఉధృతి ఎక్కువై లార్వాతో లద్దె పురుగు, మొగిపురుగు తయారై ధ్వంసం చేస్తున్నాయి.
- ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కానీ, సంబంధిత వ్యవసాయ సైంటిస్టులు కానీ క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించిన పాపాన పోవడం లేదని కర్షకులు ఆవేదన చెందుతున్నారు.
- పంటకు పురుగు తగిలిందని సంబంధిత ఫెస్టిసైడ్ షాపునకు వెళ్లి రైతులు చెబితే షాపు యజమానికి తెలిసిన మందులను మాత్రమే ఇస్తూ పంపుతున్నారు.
- ఫలితంగా ఆ మందులు తెగుళ్లపై ప్రభావం చూపకపోవడంతో బాధిత రైతు మళ్లీ మళ్లీ మందులను పిచికారీ చేయాల్సిన దుస్థితి నెలకొంది.

తెగుళ్లకు కారణం వరికొయ్యలే..

- ఈ రబీసీజన్‌లో తెగుళ్ల సోకటానికి ముఖ్య కారణం వరికొయ్యలే నని పలువురు సంబంధిత అధికారులు చెబుతున్నారు.
- కోతల సమయంలో హార్వెస్టర్లతో కోయించడం, వారు వరిని పైకి కోయడంతో వాటి వల్లే తెగుళ్ల అధికంగా ఉంటున్నాయి.
- కొయ్యలను కిందికి కోసి తగుల బెట్టే సమయంలో పూర్తిగా కాలిపోతే ఇలాంటి తెగుళ్ల ఉండవు.
- వానాకాలం పంట పూర్తి అవగానే డిసెంబర్ మాసంలో నాట్లు వేయటం, మరో కారణం కాగా వాతావరణం, చలితీవ్రత సైతం తెగుళ్లకు కారణాలు అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మూడుసార్లు మందు కొట్టాను

నాకున్న రెండు ఎకరాలల్లో డిసెంబర్ మాసంలో వరి పంట సాగు చేశాను. సాగైన 15 రోజులకే రెక్కల పురుగు వచ్చింది. దాని కోసం ముందుగా గుళికలు చల్లాను. మళ్లీ మొగిపురుగు వచ్చింది దానికి మందు పిచికారీ చేశాను. మళ్లీ లద్దెపురుగు రాగా దానికి మందు పిచికారీ చేశాను. ఇందుకోసం రూ.3,500 ఖర్చు వచ్చింది.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు

వాతావరణంలో మార్పు

ఈ సంవత్సరం వరి పంటలపై తెగుళ్ల దాడి అధికంగానే ఉంది. ఇందుకు ప్రధాన కారణం వాతావరణంలోని మార్పులతోపాటు రైతులు వరికొయ్యలను పైకి కోయడం, రెక్కల పురుగు ఉధృతి వల్లే పంటలపై వరుస తెగుళ్ల సోకుతున్నాయి. వీటి నివారణకు 2 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 (ఎస్‌పీ) మందును లీటర్ నీటికి కలిపి ఎకరాకు 8 డబ్బాలు పిచ్‌కారీ చేయాలి.

– రవికుమార్ వ్యవసాయ సైంటిస్టు



బండారు చల్లుకున్న అనంతరం భక్తిపారవశ్యంలో శివసత్తులు

మల్లన్న క్షేత్రం.. బండారుమయం

ఘనంగా పెద్దపట్నం, అగ్నిగుండాలు

- మల్లన్న నామస్మరణతో మార్మోగిన పరిసరాలు
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న క్షేత్రం సోమవారం బండారుమయమైంది. పట్నం వారాన్ని పురస్కరించుకొని సోమవారం తోటబావి ప్రాంగణంలో అగ్నిగుండాలు, పెద్ద పట్నం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులతో ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. రాజ గోపురం నుంచి తోటబావి వరకు ఏర్పాటు చేసిన పెద్దపట్నం, అగ్ని గుండాలను తిలకించేందుకు భక్తులు తండోపతండాలుగా వచ్చారు. శివసత్తులు ఒకరిపై ఒకరు బండారు(పసుపు) చల్లుకోవడంతో పరిసరాలు పసుపు మయమయ్యాయి.

21 వరుసలతో పట్నం..

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హైదరాబాద్‌కు చెందిన మానుక పోచయ్య యాదవ్, దుర్గాప్రసాద్ యాదవ్, యాదవ సంఘం, శివసత్తులు ఆధ్వర్యంలో పెద్ద పట్నం వేశారు. అగ్ని గుండాలను ఘనంగా నిర్వహించారు. ఒగ్గు పూజారులు పంచవర్ణాలతో 21 వరుసలతో పెద్దపట్నం వేశారు. అగ్ని గుండాల ఏర్పాటుకు పంచ పల్లవాలు(మామిడి, జువ్వి, రాగి, మేడి, మర్రి)తో ఐదు క్వింటాళ్ల సమిదలు పేర్చి వాటిని భగభగ మండే నిప్పు కనికలుగా తయారు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్‌తో పాటు అర్చకులు ఉత్సవ విగ్రహాలతో గర్భగుడి నుంచి తోటబావి వద్దకు భజనలు చేస్తూ ఊరేగింపుగా వచ్చి అగ్ని గుండాలు దాటారు. అనంతరం శివసత్తులు, భక్తులు భక్తి శ్రద్ధలతో దాటారు. ఈ కార్యక్రమాల అనంతరం భక్తులు కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ వద్దకు పయాణమయ్యారు. ఆనవాయితీ ప్రకారంగా హైదరాబాద్ యాదవ భక్తులకు, శివసత్తులకు కొత్త బట్టలు పెట్టి ఈఓ బాలాజీ, చైర్మన్ గీస భిక్షపతి, ధర్మకర్తలు, ఘనంగా సన్మానించారు. ఏఈఓ వైరాగ్యం అంజయ్య, సూపరింటెండెంట్ నీల చంద్రశేఖర్, ఆలయ అధికారులు పర్యవేక్షించారు. పట్నం వారాన్ని పురస్కరించుకొని సోమవారం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అదనపు డీసీపీ(అడ్మిన్) మహేందర్ తెలిపారు. అగ్నిగుండాలు, పెద్దపట్నం సందర్భంగా మొత్తం 400 మంది పోలీసులు విధులు నిర్వహించారని తెలిపారు.

పట్నంవారం ఆదాయం రూ.50 లక్షలు

స్వామి వారి పట్నం వారం ఆదాయం సుమారు రూ.50 లక్షలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శని, ఆదివారాల్లో ఆర్జిత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాద విక్రయాలు తదితరాల ద్వారా రూ.40,98,300 వచ్చాయన్నారు. సోమవారం సుమారు రూ.10 లక్షల ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు.

న్యూస్‌రీల్

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా పరిశీలకుడు డాక్టర్ రాజేశ్ కుమార్



శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రాజేశ్ కుమార్

రేగోడ్(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశీలకుడు డాక్టర్ రాజేశ్ కుమార్ కోరారు. మండల కేంద్రమైన రేగోడ్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం పరిశీలించారు. కంటివెలుగు సేవలు, వసతుల ఏర్పాట్లను డాక్టర్ శ్వేతను అడిగి తెలుసుకున్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి తిమ్మాపూర్ అటవీలో కొలువైన బంగారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం కనుల పండువగా ముగిసింది. అటవీలో చెట్టు కింద స్వయంభూగా కొలువైన బంగారమ్మతల్లికి దాతల సాయంతో నూతన ఆలయ నిర్మాణం చేపట్టారు. వేద పండితుడు, గ్రామ పురోహితుడు శాస్త్రుల వామనశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠతోపాటు ధ్వజ స్తంభధ్వేర్పాటు చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి హన్మంత్‌రావు, పూడూరు అయ్యప్పస్వామి ఆలయ ధర్మకర్త రొండా మల్లారెడ్డి, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్, సర్పంచ్ అనూష, ఉప సర్పంచ్ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

డైరీ, కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ప్రతిమాసింగ్

మెదక్ కలెక్టరేట్: తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ డైరీ, టేబుల్ కేలండర్, గోడ కేలండర్‌ను సోమవారం అదనపు కలెక్టర్లు రమేశ్, ప్రతిమాసింగ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయం అధికారిని ఆశ కుమారి, సహాయ వ్యవసాయ సంచాలకులు వి.సురేఖ, వసంత సుగుణ, అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ పాశపు గంగమల్లు, కార్యదర్శి మెంగని యాదగిరి, కోశాధికారి మందారి హరి ప్రసాద్, నాగ మాధురి, జావిద్, ఆశా వేరోనిక, అశోక్ రెడ్డి, ఎస్.శ్రీనివాస్, విజృంభన, విశల్, తదితరులు పాల్గొన్నారు.

అనాథల హక్కులను విస్మరించిన ప్రభుత్వం

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు



సమావేశంలో అఖిలపక్ష నేతలు

మెదక్ కలెక్టరేట్: అనాథల హక్కుల, సంరక్షణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని అఖిలపక్షం నేతలు ఆరోపించారు. సోమవారం మెదక్ ఐబీలో 'అనాథల హక్కుల పోరాట వేదిక ' ఆధ్వర్యంలో అఖిల పక్షం నేతలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక ఉద్యమాల నేత మందకృష్ణ మాదిగ చేసే ప్రతీ ఉద్యమం అట్టడుగు వర్గాల, పేదలకు సంపూర్ణ న్యాయం చేసేవిధంగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ, తెలంగాణ స్వరాజ్యం పార్టీ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్, మాదిగ మహిళా సమాఖ్య నాయకురాలు ప్రమీల మాదిగ, బీజేపీ నాయకులు సాయిబాబా, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ సీనియర్ నాయకులు, సభాధ్యక్షుడు అస్తగల్ల బాలరాజు మాదిగ, కొమ్ముశేఖులు మాదిగ, మద్దూరి క్రిష్ణ మాదిగ, చెట్లపల్లి యాదగిరి మాదిగ, ఎన్నెల్లి సుధాకర్, సంజీవ్ మాదిగ, పరమేశ్ మాదిగ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ మాదిగ, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు త్వరగా పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులకు సూచించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 49 వినతులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి డీఎస్ఓ శ్రీనివాస్‌తో కలిసి అదనపు కలెక్టర్ రమేశ్ వినతులను స్వీకరించారు. ఇందులో ప్రధానంగా భూ సమస్యలకు సంబంధించి 39, డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం 4, ఆసరా పింఛన్లు, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖల ద్వారా ఆర్థిక సాయం, ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం కావాలని మరో 6 వినతులు అందాయి. ఈ విజ్ఞప్తులను సంబంధింత శాఖల అధికారికి అందజేస్తూ సత్వర పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో మైనార్టీ, మహిళా శిశు సంక్షేమాధికారి జెంలా నాయక్, బ్రహ్మాజీ, పశు సంవర్ధక అధికారి విజయశేఖర్ రెడ్డి, నీటిపారుదల ఈఈ శ్రీనివాస్ రావు, కలెక్టరేట్ ఏఓ యూనిస్, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ట్రిపుల్‌ఆర్ సర్వే అడ్డుకున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్) : ట్రిపుల్‌ఆర్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు సర్వేను అడ్డుకున్నారు. మండల పరిధి కొంతన్‌పల్లిలో సోమవారం టిపుల్‌ఆర్ రోడ్డు కోసం భూ సర్వేకు వచ్చిన సిబ్బంది రైతులు వాగ్వాదానికి దిగారు. భూములకు సంబంధించి పరిహారం ప్రకటించకుండా సర్వే చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న, సన్నకారు రైతులకు సంబంధించి భూములు కోల్పోతున్నామని భూమికి భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్‌చారి గ్రామానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పినా వినిపించుకోలేదు. రైతుల డిమాండ్ ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రి సానుకూలం



హరీశ్‌రావుతో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, అఖిలపక్షం ప్రతినిధులు

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రి హరీశ్‌రావు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అఖిలపక్షం ప్రతినిధులు, మున్సిపల్, మార్కెట్ కమిటీ, సహకార సంఘం చైర్మన్లు జితెందర్‌గౌడ్, సరాపు యాదగిరి, బాదె చంద్రం, పీసీసీ సభ్యుడు సుప్రభాతరావు, రైతు సంఘం రాష్ట్ర ప్రతినిధి పాకాల శ్రీహరిరావు, తదితరులు మంత్రిని ఆయన నివాసంలో కలిశారు. రెవెన్యూ డివిజన్ విషయమై మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేతోపాటు అఖిలపక్షం ప్రతినిధులు తెలిపిన వివరాలను ఓపికగా విన్న మంత్రి హరీశ్‌రావు డివిజన్ ఏర్పాటు చేస్తే ఏఏ మండలాలను చేర్చాలనే విషయమై చర్చించారు. ఈ విషయమై సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త జిల్లాలతోపాటు కొత్త పంచాయతీలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. రామాయంపేట డివిజన్ మంజూరుకు ప్రజలు ఆకాంక్షతో ఉన్నారని పేర్కొన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించడంపై ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

చట్ట ప్రకారం న్యాయం చేయండి

ఎస్పీ రోహిణీప్రియదర్శిని



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న రోహిణీప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: ప్రజావాణి ఫిర్యాదు దారులకు చట్ట ప్రకారం న్యాయం జరిగేలా చూడాలని జిల్లాలోని పోలీసు అధికారులకు ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని సూచించారు. సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూల నుంచి వచ్చి బాధితులు ఫిర్యాదులు అందజేశారు. మాసాయిపేట గ్రామానికి చెందిన రేణుక ఫిర్యాదు చేస్తూ .. తన గ్రామానికే చెందిన పావని సత్యనారాయణకు 2018లో రూ. 2.50 లక్షలు అప్పుగా ఇచ్చామని, అప్పు వారం రోజుల్లో తిరిగి ఇస్తానని అనడంతో ఇచ్చామని తెలిపారు. ఆ తర్వాత డబ్బులు ఇవ్వమని అడిగితే రేపు మాపు అంటూ డబ్బులు ఇవ్వడం లేదన్నారు. ప్రస్తుతం తన భర్త ఆరోగ్యం బాగా లేదని ఆస్పత్రి ఖర్చులకి డబ్బులు లేవని కావున తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. చట్ట ప్రకారం ఫిర్యాదుకి తగిన న్యాయం చేయాలని రామాయంపేట సీఐకి సూచన చేశారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- బండి సంజయ్ పాదయాత్ర చరిత్రాత్మకం
- బూత్ లెవల్ నుంచి పార్టీ పటిష్టతకు కృషి
- కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల, పక్కన రఘునందన్‌రావు, గడ్డం శ్రీనివాస్

మెదక్‌జోన్ : రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ పాదయాత్ర చారిత్రాత్మకంగా మారిందని కేంద్ర పశువర్ధక, పాడి పరిశ్రమ మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల పేర్కొన్నారు.సోమవారం ఆయన మెదక్ వచ్చిన సందర్భంగా లోక్‌సభ ప్రవాస్ యోజన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బండి యాత్రను మరింత ఉధృతం చేయాలని అధిష్టానం నిర్ణయించిందని తెలిపారు. ఈ యాత్ర పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపుతుందన్నారు. యాత్రతో గ్రామీణ స్థాయి నుంచి పార్టీ పటిష్టతకు బాటలు వేసిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పార్టీ క్యాడర్‌ను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. మత్స్య కారులు, పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేస్తామని, కార్డుల ద్వారా మత్స్య కారులు, పాడి రైతులకు బ్యాంక్‌ల ద్వారా రుణ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నమన్నారు. పశువులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు వీలుగా దేశ వ్యాప్తంగా 4 వేల మొబైల్ వెటర్నరీ వ్యాన్ లు అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు హైకోర్టు న్యాయవాది తాళ్లపల్లి రాజశేఖర్, నందు జనార్దన్ రెడ్డి, జిల్లా నాయకుడు నందారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, విజయ్, దత్తు, పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ అమలు కోసం కృషి

మెదక్ కలెక్టరేట్: రాష్ట్రంతోపాటు మిగతా 10 రాష్ట్రాల్లోని రజకులను ఏకరీతిగా ఎస్సీ జాబితాలో చేర్చాలనే అంశంపై సమగ్ర వివరాలతో కూడిన నివేదికను అప్నా దోభీ సమాజ్ తరపున కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాలాకు అందజేసినట్టు రాష్ట్ర రజక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వర్సపల్లి తెలిపారు. సోమవారం మెదక్ ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నేతల సమావేశానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరైనట్టు పేర్కొన్నారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన మంత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతోపాటు ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా నాయకులు నాగరాజు, శ్రీనివాస్, మహేశ్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

సోమవారం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల చంద్రబోస్ పటానికి పూల మాలవేసి ఘనంగా నివాళుర్పించినట్లు ప్రిన్సిపాల్ గణపతి తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని భవిష్యత్‌ను నిర్మించుకోవాలి అని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుధా కర్ తిరుమల్ రెడ్డి, వామనమూర్తి, అన్నపూర్ణ, సరిత, రాణి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి

సీడీపీఓ హేమభార్గవి



న్యూట్రీగార్డెన్‌ను పరిశీలిస్తున్న సీడీపీఓ హేమభార్గవి

చిలప్‌చెడ్(నర్సాపూర్): వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లలకు పోషకాహారం ఇవ్వాలని సీడీపీఓ హేమభార్గవి అన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని బద్ర్యాతండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఉన్న న్యూట్రీగార్డెన్ పరిశీలించామన్నారు. సిలబస్ ప్రకారం ప్రీస్కూల్ కార్యక్రమాలు సక్రమంగా చేపట్టాలన్నారు. అనంతరం పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి, బరువు తక్కువున్న పిల్లలకు పోషకాహారం అందించాలని సూచించామన్నారు. ముఖ్యంగా ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో మునగాకు పొడి తయారు చేయాలని సూచించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం, గర్భిణులకు, బాలింతలకు అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, అంగన్‌వాడీ టీచర్ అనిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాల, గ్రామం చాలా బాగుంది

రాఘవాపూర్‌ను సందర్శించిన జార్జిరెడ్డి మూవీ డైరెక్టర్ జీవన్‌రెడ్డి


విద్యార్థులతో డైరెక్టర్ జీవన్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: రాఘవాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఎంతో బాగుందని జార్జిరెడ్డి మూవీ డైరెక్టర్ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాఘవాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను డైరెక్టర్ జీవన్‌రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన పాఠశాల తరగతి గదులు అన్ని తిరుగుతూ విద్యార్థులతో ముచ్చటించారు. తన చిన్నతనంలో గ్రామానికి వచ్చి ఆటలు ఆడేవాడినని, గ్రామంతో మంచి అనుభవాలు ఉన్నాయన్నారు. పాఠశాలల రూపురేఖలు మార్చడంలో మంత్రి చొరవ ఎంతో బాగుంది. విద్యార్థులు బాగా చదువుకొని అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు. గ్రామం కూడా చాలా బాగా అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ రమేష్, ఉపాధ్యాయ బృందం డైరెక్టర్ జీవన్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, వార్డుసభ్యులు కనకయ్య, తిరుపతి, ఉపాధ్యాయులు పూర్ణచందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మాధవి, పీఈటీ వెంకటస్వామి, శోభారాణి పాల్గొన్నారు.

ఆర్గానిక్ వ్యవసాయంతో ఆరోగ్యం


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): సహజ వ్యవసాయంతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని రామాయంపేట వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ పేర్కొన్నారు. ఈమేరకు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆర్గానిక్ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు సహజ సిద్ధంగా పండించే పంటలవైపు మొగ్గు చూపితే వారిపేర్లు నమోదు చేసుకొని వారికి కావాల్సిన విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. నగరం గ్రామానికి సీసీ కెమెరాల ఏర్పాటుకు నిరామయ వ్యవస్థాపకుడు నరేందర్ రెడ్డి రూ. 60 వేల చెక్కు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి, ఉద్యానవన అధికారి రచన, వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీలత, కావేరి, రాజు, రైతులు నీలం తిరుపతి, శ్రీధర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, మహేందర్, రాజం, మాధవారెడ్డి, ఇతర రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022–23 విద్యా సంవత్సరానికి గానూ అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు కంప్యూటర్స్ సైన్స్, ఎకనామిక్స్ బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీజీలో 55 శాతం ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్, స్లెట్ అర్హతలు ఉన్న వారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఇంటర్వ్యూ, డెమో క్లాసు ద్వారా నియామకాలు జరుగుతాయని, ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరుకావాలన్నారు. వివరాలకు 7673967514 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డిజిటల్ సేవలకు సై..

పల్లెల్లోనూ ఆన్‌లైన్ లావాదేవీలు

దుబ్బాక: నగదు రహిత లావాదేవీలకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. గతంలో జిల్లా, మండల కేంద్రాలకే పరిమితమైన ఆన్‌లైన్ లావాదేవీలు ప్రస్తుతం గ్రామస్థాయికి చేరాయి. నోట్ల రద్దు తర్వాత ప్రజలను డిజిటల్ లావాదేవీల వైపు మళ్లించాలనే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. రోజురోజుకు స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరగడంతో డిజిటల్ లావాదేవీలు మరింత సులభతరమయ్యాయి. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, యోనో యాప్‌ను ప్రజలు ఎక్కువగా వాడుతున్నారు.

టీకొట్టు నుంచి.. రెస్టారెంట్ల వరకు

ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు సర్వసాధారణమయ్యాయి. టీకొట్టు నుంచి మొదలు పెద్ద పెద్ద ఫ్యామిలీ రెస్టారెంట్ల వరకు, పండ్ల కొట్టు నుంచి పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వరకు నగదు రహిత లావాదేవీల వైపు జనం దృష్టి సారిస్తున్నారు. గతంలో చాలా మంది స్వైపింగ్ మిషన్లతో లావాదేవీలు చేసేవారు. అదనపు చార్జీలు విధిస్తున్నారనే కారణంతో అనేక మంది డిజిటల్ లావాదేవీలు చేయడంలో యాప్‌ల వైపు ఆసక్తి చూపుతున్నారు. దుకాణదారులు ఆన్‌లైన్ లావాదేవీలకు సంబంధించిన క్యూఆర్ కోడ్లను దుకాణాల ఎదుట ఉంచుతున్నారు. వినియోగదారులు వాటిని స్కాన్ చేసి డబ్బులు పంపడంతో ఇటు వినియోగదారులకు అటు దుకాణదారులకు ఇబ్బంది లేకుండా సులభతరంగా లావాదేవీలు జరుగుతున్నాయి.


పండ్ల దుకాణం వద్ద డిజిటల్ లావాదేవీలు చేస్తున్న వినియోగదారుడు (ఫైల్)

ఆఫర్లు మీద ఆఫర్లు

కొన్నిరకాల సంస్థలు తమ యాప్‌లను ఉపయోగించే విధంగా వివిధ రకాల ఆఫర్లు ఇస్తున్నాయి. కొన్ని రకాల సంస్థలు రూ.100 నుంచి రూ. 2,000 వరకు కొనుగోలు చేస్తే రివార్డు పాయింట్లు ఇస్తున్నారు. మరికొన్ని రకాల యాప్‌ల ద్వారా వస్తువులు కొనుగోలు చేస్తే డిస్కౌంట్ రావడంతో ప్రజలు ఆన్‌లైన్ లోనే ఎక్కువగా షాపింగ్ చేస్తూ డబ్బులు చెల్లిస్తున్నారు.

లావాదేవీలు పెరుగుతున్నాయి



రోజు రోజుకు లావాదేవీలు పెరుగుతున్నాయి. ప్రతీ బ్యాంకు ఓ యాప్ నిర్వహిస్తోంది. ప్రభుత్వం కూడా డిజిటల్ లావాదేవీలు ప్రోత్సహిస్తుంది. స్మార్ట్ ఫోన్ లేనివారు యూఎస్ఎస్‌డీ ద్వారా మొబైల్ బ్యాంకింగ్ చేయవచ్చు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి ఆమోదం పొందిన సంస్థ యాప్‌లను మాత్రమే ప్రజలు వాడాలి.

– సత్యజిత్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, సిద్దిపేట

వ్యాపారం సులభతరమైంది



నేను గత ఐదేళ్లుగా పాల దుకాణం నడుపుతున్నాను. డిజిటల్ లావాదేవీలు రాక ముందు డబ్బులు ఇచ్చేటప్పుడు చిల్లర కోసం చాలా ఇబ్బంది పడ్డాం. కానీ ఇప్పుడు డిజిటల్ లావాదేవీల ద్వారా చిల్లర సమస్య తీరింది. దీంతో వ్యాపారం సులభతరమైంది.

– నటరాజ్, పాల దుకాణం యజమాని, దుబ్బాక


ఆందోళన చేస్తున్న యువతులు

ఆడబిడ్డల గోస పట్టదా..?

కొనసాగుతున్న భూ నిర్వాసితుల ఆందోళన

అక్కన్నపేట(హుస్నాబాద్): 'తామంతా ఈప్రాంత ఆడబిడ్డలం.. ఇక్కడే పుట్టాం తమను ఎందుకు పరిగణలోకి తీసుకోరని పెళ్లయిన ఆడబిడ్డలు ప్రశ్నిస్తున్నారు'. మండలంలోని గుడాటిపల్లి వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న భూనిర్వాసితులు (పెళ్లయిన ఆడబిడ్డలు) గుడాటిపల్లి వద్ద చేపట్టిన దీక్ష సోమవారం నాటికి 45వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా దీక్షా శిబిరం వద్ద వంటా వార్పు చేసి నిరసన చేపట్టారు. అనంతరం పలువురు యువతులు మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినప్పుడు తమలో కొందరు మైనర్లు, కొందరు మేజర్లుగా ఉన్నామన్నారు. ప్రాజెక్టు పనులు 15 ఏళ్లు కావొస్తున్న క్రమంలో కాలక్రమేణా పెళ్లిలు చేసుకున్నామన్నారు. పెళ్లి కాక ముందే తమ పేర్లు ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ లిస్టులో ఉందని.. ఇటీవల కావాలనే పెళ్లి చేసుకున్నారని తీసేశారని వాపోయారు. ప్రభుత్వం ప్రాజెక్టు కట్టే వరకూ ఆడబిడ్డల పెళ్లిలు కాకుండా ఉంటాయా? అని ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రెట్టింపు నగదు అంటూ మోసం

రూ. 10 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన టెలిగ్రామ్ మెసేజ్‌కు స్పందించిన వ్యక్తి రూ. 10 లక్షల ఏడు వేల నగదును పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణంలోని జేపీ కాలనీకి చెందిన భాస్కర్ ఈనెల 21వ తేదీన టెలిగ్రామ్ ద్వారా పార్ట్ టైం ఉద్యోగం ఉందంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు మెసేజ్‌ను అనుసరిస్తూ తన వివరాలు నమోదు చేశాడు. అనంతరం రూ. 11 వేలు ముందుగా వేసి ఇచ్చిన టాస్క్ పూర్తిచేశాడు. ఇలా పలు దఫాలుగా మొత్తం రూ. 10 లక్షల ఏడు వేలు ఇన్వెస్ట్ చేయగా నగదు రెట్టింపు అయిన తర్వాత ఒకేసారి డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని అపరిచిత వ్యక్తి చెబుతూ వచ్చాడు. ఈక్రమంలో రెట్టింపైన నగదును చెల్లించాలని బాధితుడు కోరగా, అటువైపు నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన భాస్కర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూలీల హక్కుల సాధనకు పోరాడాలి


మాట్లాడుతున్న శశిధర్

చేర్యాల(సిద్దిపేట): వ్యవసాయ కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో మల్కని ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా రాయితీలు ఇవ్వకుండా, ఉపాధి చూపకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వాలు తెచ్చిన జాతీయగ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తుందన్నారు. ఆహారభద్రతా చట్టాన్ని తుంగలో తొక్కి కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టాన్ని రూపొందించకుండా కేంద్ర ప్రభుత్వం ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో, నాయకులు చంద్రం, నర్సయ్య, అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఫార్మసీ విద్యార్థిని అదృశ్యం


రోషిణి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: బీఫార్మసీ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం.. రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రోషిణి ఈనెల 13వ తేదీన సంక్రాంతి సెలవులకు బాబాయి ఇంటికి చెముడులంకకు వెళ్లింది. తిరిగి 16వ తేదీన కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి బయలుదేరింది. 22వ తేదీన టాంజానియాలో ఉన్న తండ్రి రాముకు ఫోన్‌చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పింది. దీంతో కుటుంబ సభ్యులు కళాశాలకు ఫోన్ చేయగా 22వ తేదీ వరకు సెలవులు ఉన్నాయని చెప్పారు. తండ్రి రాము కూతురుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి సోమవారం జరిమానా విధించారు. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహన తనిఖీల్లో 13 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేశ్ బాబు వారికి రూ. 30 వేల జరిమానా విధించారు.

మెదక్ ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వృద్ధుడు



మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గుర్తుతెలియని వృద్ధుడు ఉన్నాడని.. ప్రస్తుతం అతడు మాట్లాడలేని స్థితిలో ఉన్నాడని సోమవారం పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తుపట్టేవారు ఎవరైనా ఉంటే పట్టణ ఎస్ఐ 7901150267, 8187825515, 9392305461 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గ్యాస్ కనెక్షన్ మంజూరైందని..

డబ్బులు కాజేసిన ఆగంతకుడు

మద్దూరు(హుస్నాబాద్): మీకు కొత్త గ్యాస్ కనెక్షన్ మంజూరైంది.. డబ్బులు చెల్లించి తీసుకోవాలని వృద్ధ దంపతుల వద్ద గుర్తుతెలియని వ్యక్తి డబ్బులు కాజేశాడు. ఈసంఘటన దూళ్మిట్ట మండలంలోని కూటిగల్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మణె లక్ష్మి శంకయ్య వృద్ధ దంపతుల వద్దకు సోమవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మీకు కొత్త గ్యాస్ కనెక్షన్ మంజూరైంది, రూ. 3,500 చెల్లిస్తే వెంటనే సిలిండర్ ఇస్తానని చెప్పాడు. దీంతో వారు తమకు పాత గ్యాస్ కనెక్షన్ ఉందని కొత్తది అవసరం లేదని చెప్పారు. పాతదానితో పాటు కొత్తది కూడా మంజూరైందని డబ్బులు ఇస్తే సిలిండర్ తీసుకువస్తానని నమ్మించాడు. దీంతో అతడి మాటలు నమ్మిన వృద్ధులు రూ. 3,500 ఇచ్చారు. డబ్బులు తీసుకొని రాకపోవడంతో తాము మోసపోయాని గ్రహించారు. ఎస్ఐ నారాయణ మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఫిర్యాదు రాలేదని తెలిపారు.

అత్తను చంపిన అల్లుడు

బంగారం అమ్ముకున్న విషయంలో ఇద్దరి మధ్య గొడవ

చిలప్‌చెడ్(నర్సాపూర్): కూతురు పెళ్లికి ఇచ్చిన బంగారాన్ని అల్లుడు అమ్ముకున్న విషయంలో గొడవ జరగగా ఆవేశానికి గురైన అల్లుడు అత్తను రాడ్‌తో కొట్టిచంపిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. సీఐ షేక్‌లాల్ మధార్, ఎస్ఐ మహ్మద్‌గౌస్ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం ఎదురుగూడెంకు చెందిన అల్లాడ అనసూజ (55) తన కూతురు సరితను ఫైజాబాద్‌కు చెందిన అంతిరెడ్డిగారి బుచ్చిరెడ్డికి ఇచ్చి 14 ఏళ్ల కిత్రం వివాహం చేసింది. వారికి ఓ కుమారుడు ఉన్నాడు. పెళ్లి సమయంలో ఇచ్చిన బంగారాన్ని బుచ్చిరెడ్డి అమ్ముకోవడంతో వారి కాపురంలో గొడవలు మొదలయ్యాయి. ఈక్రమంలో సంక్రాంతికి అమ్మగారి ఇంటికెళ్లిన సరిత తిరిగి 22వ తేదీ ఆదివారం అమ్మ అనసూజతో కలిసి ఫైజాబాద్ వచ్చింది. అదేరోజు రాత్రి బంగారం విషయంలో అత్తతో బుచ్చిరెడ్డికి గొడవ జరిగింది.


విచారిస్తున్న సీఐ షేక్‌లాల్ మధార్, ఎస్ఐ మహ్మద్‌గౌస్

ఈక్రమంలో ఆగ్రహానికి గురైన బుచ్చిరెడ్డి అత్తను రాడ్‌తో బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

చేర్యాల(సిద్దిపేట): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణ కేంద్రంలోని బీడీ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రానికి చెందిన కదారి వీరస్వామి (37) గత కొద్ది రోజులుగా మద్యానికి బానిసై భార్య పిల్లలను వేధించేవాడు. ఈక్రమంలో శనివారం తాగి వచ్చి కొట్టడంతో వారు సిద్దిపేటలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వీరస్వామి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం వచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఈవిషయమై మృతుడి భార్య మంగ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


వీరస్వామి మృతదేహం

కూడవెల్లికి పోటెత్తిన భక్తులు


నందికి మొక్కుతున్న కేంద్ర మంత్రి రూపాల, ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్/ దుబ్బాకరూరల్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కూడవెల్లి రామలింగేశ్వర జాతరకు మూడోరోజు భక్తులు పోటెత్తారు. ఒక్క రోజే సుమారుగా 2 లక్షలకుపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ కమిటీ అంచనా వేసింది. ఇప్పటివరకు సుమారు 4 లక్షలకు పైగా భక్తులు జాతరకు హాజరైనట్లు తెలిపారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు భారీగా తరలిరావడంతో కూడవెల్లి ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లలో నిలబడి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

కేంద్రమంత్రి రూపాల పూజలు..

కూడవెల్లి జాతరకు కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు హాజరై రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మహత్యం, జాతర విశేషాలను కేంద్రమంత్రికి ఎమ్మెల్యే రఘునందన్‌రావు వివరించారు. ఈసందర్భంగా కేంద్రమంత్రి రూపాల మాట్లాడుతూ.. ఎంతో పురాతన చరిత్ర కలిగిన కూడవెల్లి జాతరలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేవాలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పూజారి చంద్రం, ఈఓ విశ్వనాథశర్మ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జి జయశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేష్‌గౌడ్, సాయిలు, అరిగె కృష్ణ, జలందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కూడవెల్లి రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.


స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కాళ్ళకల్‌లో అద్దెకుంటున్న శ్రీనివాస్, తన తల్లి పద్మావతిని తీసుకొని పనినిమిత్తం తూప్రాన్‌కు బైక్‌పై వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా నిజామాబాద్ నుంచి మేడ్చల్ వైపు వెళ్తున్న కారు రామాయపల్లి జాతీయ రహదారిపై అదుపుతప్పి వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో పద్మావతి, శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.


గాయపడిన పద్మావతి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

కంది(సంగారెడ్డి): పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు సూచించారు. సోమవారం కందిలోని మైనార్టీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని వంటశాల, విద్యార్థులు భోజనం చేసే హాలు అపరిశుభ్రంగా ఉండడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులను బాగా చూసుకోవాలని ప్రిన్సిపాల్ ఉషారాణికి సూచించారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

సిద్దిపేటరూరల్: వరికి ఆశించే చీడపీడల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశోధనాస్థానం శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. సోమవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో వరి పంటను పరిశీలించారు. ఎక్కువగా వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి పెరుగుతున్న క్రమంలో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. వరి పైరు కొన్నిచోట్ల నారుమడి దశలో, మరి కొన్ని ప్రాంతాల్లో పిలక దశలో ఉన్నాయన్నారు. గత రెండు సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం పిలక దశలో కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు రైతులు సోలార్ దీపపు ఎర, లింగాకర్షక బుట్టలను అమర్చుకొని రెక్కల పురుగుపై నిఘా పెట్టాలని సూచించారు. పిలకదశలో ఎకరాకు మూడు లింగాకర్షక బుట్టలు పెట్టి అందులో వారానికి బుట్టకు 25 నుంచి 30 పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చేపట్టాలన్నారు. ప్రధాన పొలంలో గుళికల మందులు వాడితే ఖర్చు ఎక్కువవుతుందని, నారు నాటే వారం రోజుల ముందు ఎకరాకు సరిపడా నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు లేదా 600 గ్రాముల ఫిప్రోనిల్ 0.3జీ గుళికలు వేయాలని సూచించారు. ఒకవేళ నారు మడిలో వేయకపోతే పిలక దశలో ఉన్న వరి పైరులో వేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సరిత, డాట్ సెంటర్ విజయ్, రమణి, ఏఓ, ఏఈఓ నాగార్జున, రైతులు పాల్గొన్నారు.


వరిని పరిశీలిస్తున్న అధికారులు